


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
01-11-2025
పేజీలు: 02




# మాస్ జాతర రివ్యూ



లక్ష్మణ్ భేరి (రవితేజ) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోతాడు. తన తండ్రిలాగా పోలీస్ కావాలని కలలు కంటాడు. కానీ అతని తాత హనుమాన్ భేరి (రాజేంద్రప్రసాద్) అందుకు ఒప్పుకోడు. తన కొడుకులాగా మనవడిని కూడా అదే యూనిఫార్మ్ లో పోగొట్టుకోవాల్సి వస్తుందేమోనని అతని భయం. అయినా లక్ష్మణ్ పట్టుబడతాడు. చేసేదేమీ లేక చివరికి రైల్వే పోలీస్ కావడానికి అనుమతిస్తాడు హనుమాన్. అక్కడ రిస్క్ తక్కువన్నది అతని ఫీలింగ్. అయితే లక్ష్మణ్ మామ పోలీస్ ఆఫీసర్ (సముద్రఖని) మాత్రం మేనల్లుడిలో ఫైర్‌కి తగ్గ పని చెబుతానని మాటిస్తాడు. ఆ మాట ప్రకారమే కేసులను తన మేనల్లుడు ఉన్న రైల్వే స్టేషన్ పరిధిలోకి డైవర్ట్ చేస్తుంటాడు. అలా_ _ _ ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి ట్రాన్స్ ఫర్ అవుతుంటాడు లక్ష్మణ్. అడవివరంలో శీలావతి గంజాయి సమస్య ఉందని తెలుసుకుని అక్కడికి తన మేనల్లుడిని పంపిస్తాడు పోలీస్ ఆఫీసర్. స్టేషన్‌లో దిగగానే అన్యాయాన్ని ప్రశ్నించడం మొదలుపెడతాడు లక్ష్మణ్. అయితే అక్కడి లోకల్ అధికారులు అతనికి సహకరించరు. మరోవైపు అడవి వరంలో తులసి (శ్రీలీల) అనే టీచర్‌తో పరిచయం అవుతుంది లక్ష్మణ్‌కి. అప్పటిదాకా పెళ్లి కాని లక్ష్మణ్ ఆమెని ప్రేమిస్తాడు. ఆ ఊళ్లోనే శివుడు (నవీన్ చంద్ర) అని ఓ గంజాయి వ్యాపారి ఉంటాడు. చుట్టు పక్కల ఊళ్లల్లో రైతులతో గంజాయి పండించి కలకత్తాలో ఉన్న పాత్రోకి విక్రయిస్తుంటాడు. తను మనసుపడ్డ గంగ (నవ్య)ను బలవంతంగా తీసుకొచ్చి ఇంట్లో గొలుసులతో కట్టేస్తాడు. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు.. ఈ విషయాలన్నీ లక్ష్మణ్ దృష్టికి వస్తాయి. ఒక్కో విషయాన్ని ఛేధించుకుంటూ వెళ్తాడు. ఈ క్రమంలో అతనికి తులసి గురించి ఓ నిజం తెలుస్తుంది. అది ఏంటి? అసలు తులసి ఎవరు? శివుడితో తులసికి ఉన్న సంబంధం ఏంటి? శివుడి ఇంట్లో ఉన్న గంగను అడవి మనుషులు అంత ప్రేమగా ఎందుకు చూసుకున్నట్టు? అసలు పాత్రో ఎవరు? హనుమాన్ భేరి ఫ్లాష్ బ్యాక్ ఏంటి? ఇవన్నీ సినిమాలో ఎప్పటికప్పుడు ఇంట్రస్ట్ క్రియేట్ చేసే అంశాలు. పోలీస్ ఆఫీసర్ కేరక్టర్ రవితేజకు కొట్టిన పిండి. కోరమీసాన్ని ఎగదువ్వుతూ రవితేజ డైలాగులు చెబుతుంటే వింటేజ్ పోలీస్ గెటప్పులను మరోసారి గుర్తుచేసుకుంటారు ఫ్యాన్స్. రైల్వే ట్రాక్ మీద, రైల్వే స్టేషన్‌లో రవితేజ కనిపించే సన్నివేశాలన్నీ మరో రేంజ్ స్వాగ్ అన్నమాట. శ్రీలీల చీరకట్టులోనూ, లంగా ఓణీలోనూ కనిపించినా స్క్రీన్ మీద కలర్‌ఫుల్‌గా అనిపించారు. తండ్రి కేరక్టర్‌లో నరేష్, తాత కేరక్టర్‌లో రాజేంద్రప్రసాద్, కరడుగట్టిన శివుడుగా నవీన్ చంద్ర, రైల్వే పోలీస్ సుబ్రమణ్యంగా ప్రవీణ్, పాత్రో అసిస్టెంట్‌గా వీటీవీ గణేష్, శివుడు వైపు నిలుచున్న వ్యక్తులుగా హైపర్ ఆది, అజయ్ ఘోష్.. ప్రతి ఒక్కరూ తమ పరిధి మేర చక్కగా నటించారు. నందు రాసిన డైలాగులు అక్కడక్కడా ప్రేక్షకులను బాగానే నవ్వించాయి. అడవివరం స్టేషన్, లొకేషన్లు, నైట్ షూట్, జాతర ఎపిసోడ్స్ ని బాగా డీల్ చేశారు డైరక్టర్. ఎటొచ్చీ కథే ఆల్రెడీ తెలిసినట్టు, చూసినట్టు అనిపిస్తుంది. అవినీతికి పాల్పడి కొడుకును పోగొట్టుకున్న పోలీస్, న్యాయాన్ని నమ్ముకున్నప్పుడు తానే లేకుండా పోతాడు_ _ _ ఇలాంటి కొన్ని పాయింట్స్ ని కొత్తగా చెప్పే ప్రయత్నం చేశారు డైరక్టర్. రచన పరంగా టోటల్ యాంబియన్స్ ని కొత్తగా క్రియేట్ చేసినప్పటికీ, రవితేజ మార్క్ హిట్ సినిమాల తాలూకు స్పెషల్ అంశాలు చాలా చోట్ల గుర్తుకొస్తాయి. అందులోనూ శీలావతి, గంజాయి, అడవివరం అనేసరికి లీసెంట్‌గా రిలీజ్ అయిన ఘాటిని గుర్తుచేసుకున్నారు ప్రేక్షకులు. పలు సన్నివేశాల్లో బలం లేకపోయినా హుషారైన నేపథ్య సంగీతంతో వాటిని రక్తికట్టించే ప్రయత్నం చేశారు భీమ్స్. యాక్షన్ ఎపిసోడ్స్ గగుర్పొడిచేలా ఉన్నాయి. ఫస్టాఫ్ లో ఉన్న ఫ్లో, సెకండ్ హాఫ్లోనూ ఉండుంటే బావుండేది. సన్నివేశాలన్నీ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపించేసరికి కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టినట్టు అయింది.

## ప్రజలు విశ్వసిస్తే 150 సీట్లు.. లేదంటే 10 కంటే తక్కువే

### జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీకి 150 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. లేదంటే 10 కంటే తక్కువ సీట్లు వచ్చే అవకాశం కూడా ఉందన్నారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా నిర్వహించిన బీహార్ పవర్‌ప్లే కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా ఈ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకోగలదు..? అన్న ప్రశ్న ఆయనకు ఎదురైంది. దీనికి సమాధానంగా.. 'ప్రజలు జన్ సురాజ్‌ను ప్రత్యామ్నాయంగా భావిస్తే.. 150 కంటే ఎక్కువ సీట్లు వస్తాయి. అదే తిరస్కరిస్తే మాత్రం 10 కంటే తక్కువ సీట్లకే పరిమితం కావొచ్చు' అని వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఇతర పార్టీలతో పొత్తు విషయంపై కూడా ప్రశాంత్ కిషోర్ క్లారిటీ ఇచ్చారు. తాము ద్వంద్వ రాజకీయాలు చేయమని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత జన్ సురాజ్ పార్టీ ఇతర ఏ పార్టీలతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్న విషయం తెలిసిందే. నవంబర్ 6న తొలి విడత, నవంబర్ 11న రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు.



## అదిరిపోయే ఛాన్స్.. కొట్టేసిన భూమి శెట్టి

ప్రశాంత్ వర్మ పీవీసీయూ నుంచి విభిన్న కథలతో సినిమాలు ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ ఏడాది ఓ సినిమాను ప్రకటించారు. ప్రశాంత్ వర్మ. పీవీసీయూ నుంచి వస్తున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. ఇందులో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి 'కింగ్డమ్' సినిమాలో కనిపించిన విషయం తెలిసిందే.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



మొంథా తుపాను తెలుగు రాష్ట్రాలకు అతలకుతలం చేసింది. తుఫాను కారణంగా పంట నష్టంతో పాటు చాలా ఇళ్లు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపథ్యంలో నిన్న సీఎం రేవంత్‌రెడ్డి వరద ప్రరభావిత ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు అందిస్తామని, అలాగే మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పన పరిహారం అందిస్తామని చెప్పారు. అలాగే నీట మునిగిన ఇంటికి రూ.15 వేలు, ఇల్లు పూర్తిగా కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే అంశంపై పరిశీలిస్తామని తెలిపారు. అలాంటి వారికి ఇల్లు మంజూరు కోసం పరిశీలించాలని సీఎం అధికారులను ఆదేశించారు. బాధితులకు అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని వెల్లడించారు. ముంపు ప్రాంతాల్లో కాలినడకన తిరిగి.. బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అలాగే హనుమకొండ కలెక్టరేట్‌లో ఏడు జిల్లాల అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. వర్షాలు, వరద నష్టాలపై తక్షణమే నివేదికలు తయారు చేయాలని సూచించారు. వరద కారణంగా గొర్రె చనిపోతే రూ.5 వేలు, గేదె, ఆవు చనిపోయినట్లయితే రూ.50 వేల పరిహారం ఇచ్చేలా ప్రతిపాదించాలన్నారు. అలాగే వర్షాల కారణంగా కూలిపోయిన ఇల్లు, షెడ్లను సీఎం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. వర్షాల కారణంగా పిల్లల పుస్తకాలు, సర్టిఫికెట్లు, నిత్యావసరాలు, ఇతర సామగ్రి మొత్తం వరదలోనే కొట్టుకుపోయాయని బాధితులు సీఎంకు వివరించారు.

## పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారం

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పట్టపగలే నడిరోడ్డుపై మహిళపై అత్యాచారం జరిగిన ఘటన కలకలం రేపింది. ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై పారిశుధ్య కార్మికులపై అత్యాచారం జరిగింది. దీంతో మహిళ ఏడుస్తూ బోరబండ పోలీసులను ఆశ్రయించగా.. రాజు అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై చెత్తను ఊడుస్తుండగా అక్కడే మాటేసిన రాజు అనే వ్యక్తి కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దారుణ ఘటనపై బాధిత మహిళ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్నారు. మద్యం సేవించి ఉన్న రాజు ఆ మత్తులో పారిశుధ్య కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు మోడల్ కాలనీలో ఓ అపార్టెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నట్టు తెలుస్తోంది.




## తగ్గిన గ్యాస్ సిలిండర్ ధర

నిత్యావసర వస్తువుల్లో చాలా కీలమైన గ్యాస్ సిలిండర్ ధరలు అంతర్జాతీయ ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. తదనుగుణంగా ఈ ధరలను ప్రతి నెల ఒకటో తేదీన సవరిస్తుంటారు. ఈ క్రమంలో నవంబర్ 1వ తేదీ నుంచి దేశంలోని ప్రధాన నగరాల్లో గ్యాస్ ధరల్లో మార్పులు వచ్చాయి. గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు జరగలేదు. కమర్షియల్ సిలిండర్ల ధరలు మాత్రం కొంత మేర ఈ నెలలో తగ్గించారు. 19 కిలోల వాణిజ్య అవసరాలకోసం వాడే LPG సిలిండర్ ధర ఐదు రూపాయలు తగ్గింది. ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1,590.50 ఉంది. గతంలో రూ.1,595.50 గా ఉండేది. కోల్‌కతాలో ప్రస్తుత ధర రూ.1,694, ముంబైలో రూ.1,542, చెన్నైలో రూ.1,750. హైదరాబాద్‌లో రూ.1,812.50 ఉంది. ఇక, గృహ వినియోగ LPG సిలిండర్ల ధరలు గత నెలలో లాగనే కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో వంట గ్యాస్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య ఉంది. ఢిల్లీలో రూ.853, ముంబైలో రూ.852.50, హైదరాబాద్‌లో రూ.905 ఉంది.



## కిటికీ గ్రిల్ తొలగించి.. 40 తులాల బంగారం చోరీ

తాళం వేసి ఉన్న ఇంటి కిటికీ గ్రిల్ తొలగించి లోపలకు వెళ్లిన దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. నాగోల్ పోలీసుల వివరాల ప్రకారం.. నాగోల్ సాయినగర్‌కాలనీ రోడ్డు నంబర్.1లో భాస్కర్, ప్రమీల దంపతులు నివాసముంటున్నారు. గత నెల 17న ఇంటికి తాళం వేసి నగరంలో ఉండే ప్రమీల సోదరుడు శ్రీనివాస్‌కు చెప్పి అమెరికాకు వెళ్లారు. గురువారం ఇంట్లో లైట్లు వెలిగి ఉన్నాయని, కిటికీ గ్రిల్ తొలగించి ఉందని శ్రీనివాస్ కు ఆ ఇంటి ఎదురుగా ఉండే వినోద్ ఫోన్ చేశాడు. శ్రీనివాస్ ఇంటిని పరిశీలించి దొంగతనం జరిగినట్లు ప్రమీలకు సమాచారం ఇచ్చారు. బీరువాలోని 40 తులాల బంగారం, రెండు వెండి ప్లేట్లు, ఇతర వెండి ఆభరణాలు ఉన్నాయా అని చూడమని సూచించింది. శ్రీనివాస్ వెళ్లి చూడగా అవి కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## నవంబర్ కోటా రేషన్ బియ్యం రెడీ

నవంబరు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. బియ్యం స్టాకును రేషన్ షాపులకు తరలించామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 7,98,269 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. ఈ కార్డుల ద్వారా మొత్తం 30,42,056 మంది లబ్దిదారులు జిల్లా పరిధిలో ఉన్నారు. నవంబరు నెలకు సంబంధించి పంపిణీ చేయాల్సిన కోటా 17,102 టన్నుల సన్న బియ్యాన్ని గోడౌన్‌లలో సిద్ధంగా ఉంచారని, మొదటి విడతగా 8,500 టన్నుల బియ్యాన్ని నగరవ్యాప్తంగా 653 రేషన్ షాపులకు పంపించామని తెలిపారు. సన్నం బియ్యంతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలో గోధుమలను రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తున్నామని, ఈనెల కోటా 3,400 టన్నులు కేటాయించామని తెలిపారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# కారుకు ఓటేస్తే.. స్కీములు ఆపేస్తం



'బీఆర్ఎస్సోడికి ఓటేసిర్రంటే.. మీ పిల్లలకు పెడుతున్న సన్నబియ్యం బువ్వ రద్దు చేస్తం' అని ముఖ్యమంత్రి హోదాలో జూబ్లీహిల్స్ ఓటర్లను రేవంత్‌రెడ్డి బహిరంగంగా బ్లాక్‌మెయిల్ చేశారు. శుక్రవారం రహమత్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించిన రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే స్కీములను రద్దు చేస్తామని బహిరంగంగా హెచ్చరించారు. ఈ రెండేండ్లలో తాను చేసిన మంచి పనుల గురించి చెప్పకోకుండా ఇచ్చిన రేషన్‌కార్డులు, వాటి ద్వారా పొందే సన్నబియ్యం, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాల రద్దు గురించి మాట్లాడారు. రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ 'ఇయ్యాల బీఆర్ఎస్సోడికి ఓటేసిర్రంటే.. మీ పిల్లలకు పెడుతున్న సన్నబియ్యం బువ్వ రద్దయితది. ఇయ్యాల బీఆర్ఎస్సోడు వస్తే.. పేదోళ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంటు రద్దయితది. ఇక్కడ 25 వేల మందికి ఇచ్చిన రేషన్‌కార్డులు రద్దయిపోతయ్. ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం రద్దయిపోతుంది' అంటూ బహిరంగ హెచ్చరికలు చేశారు. రోడ్‌షోలో సీఎం ప్రసంగం వింటున్న జూబ్లీహిల్స్ ఓటర్లు నివ్వెరపోయారు. 'ఒక్క ఎమ్మెల్యే సీటు ఓడిపోతే.. ఇవ్వన్నీ రద్దు చేస్తరా?' అంటూ విస్తుపోయారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'ముఖ్యమంత్రి ఇంత బహిరంగంగా బెదిరిస్తారా?' అంటూ నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇదే విషయంపై బీఆర్ఎస్ నేత వై సతీశ్‌రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. 'ప్రజలను బెదిరిస్తున్న ముఖ్యమంత్రి.. కేవలం జూబ్లీహిల్స్ ప్రజలకే రద్దయితయా? లేక తెలంగాణలో అందరికీ రద్దయితయా? ఏ సీఎం అయినా చేసిన మంచి చెప్పి, ఇంకా ఏం చేస్తారో చెప్పి ఓటు అడగాలి కాని.. ఉన్నయి రద్దు చేస్తామని బెదిరిస్తూ ఓటు అడిగే సీఎంను ఇప్పుడే చూస్తున్నం. ఒకపక్క ప్రతిపక్ష నాయకులను కాంగ్రెస్ అభ్యర్థి బెదిరిస్తుంటే.. ముఖ్యమంత్రి ఏకంగా ప్రజలనే బెదిరిస్తున్నడు' అంటూ సతీశ్‌రెడ్డి తన అభిప్రాయం వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం రేవంత్‌రెడ్డి నిర్వహించిన రోడ్‌షోకు నిరసన సెగ తగిలింది. వెంగళ్‌రావునగర్ కృష్ణకాంత్ పార్క్ వద్ద నిర్వహించిన సీఎం సభలో ఆమ్‌ఆద్మీ పార్టీ మహిళా కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇవ్వాలని, విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని, చిత్రపురి కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ మహిళా కార్యకర్తల నిరసనతో కాంగ్రెస్ నాయకులు కంగుతిన్నారు. అక్కడే ఉన్న పోలీసులు ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా కార్యకర్తలను ఈడ్చి పడేశారు. వారితో దురుసుగా ప్రవర్తించారు. బలవంతంగా పోలీస్ వాహనంలో ఎక్కించి మధురానగర్ పోలీస్‌స్టేషకు తరలించారు. హామీలు నెరవేర్చాలని అడిగిన తమ గొంతునొక్కడం దౌర్భాగ్యమని ఆప్ నాయకురాలు హేమ మండిపడ్డారు. ప్రశ్నించడమే తాము చేసిన తప్పా అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రభుత్వం అంటే మహిళలను అవమానించడం..అగౌరవపరచడమేనా? అని నిలదీశారు.



## బీసీ హాస్టల్‌లో కలుషితాహారం.. 53 మంది విద్యార్థులకు అస్వస్థత

జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం బీసీ వసతిగృహంలో ఆహారం కలుషితమైంది. దీంతో 53 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వసతిగృహంలో మొత్తం 125 మంది విద్యార్థులు ఉండగా_ _ _ శుక్రవారం 110 మంది హాజరయ్యారు. రాత్రి భోజనాలయ్యాక 9 గంటల తర్వాత 86 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. వసతిగృహం సిబ్బంది, పోలీసులు వారిని అంబులెన్స్‌లో గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం విద్యార్థులు కోలుకున్నారని, ప్రస్తుతం దవాఖానలో 53 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. వారి పరిస్థితి బాగానే ఉందని చెప్పారు. బీసీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కారణంగా 53 మంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు.



## శబరిమల బంగారం చోరీ కేసులో మాజీ ఈవో అరెస్టు

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో బంగారం తాపడం పేరుతో జరిగిన మోసం కేసులో అధికారులు ఇవాళ మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధీశ్ కుమార్‌ను అరెస్టు చేశారు. 2019లో శబరిమల ఈవోగా సుధీశ్ బాధ్యతలు నిర్వర్తించారు. తిరువనంతపురంలో క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయ్యప్ప స్వామి వద్ద ఉన్న ద్వారపాలకుల విగ్రహాల సమాచారాన్ని దాచిపెట్టినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. బంగారు తాపడం ఉన్న ద్వారపాలకుల విగ్రహాలను.. కాపర్ షీట్లుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించినట్లు మాజీ ఈవోపై ఆరోపణలు ఉన్నాయి. ద్వారపాలకుల విగ్రహాల తాపడం కోసం వాటిని ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టికి అందజేశారు. వాస్తవానికి ఆ విగ్రహాలకు 1998లో గోల్డ్ ప్లేటింగ్ జరిగింది. అయితే మళ్లీ 2019లో ఆ విగ్రహాలను ఈవోగా ఉన్న సుధీశ్ వాటిని ఉన్నికృష్ణన్‌కు అందజేశారు. ఆ విగ్రహాలను రాగితో ప్లేటింగ్ చేసి ఉన్నట్లు చూపించి, వాటిని ఉన్న బంగారాన్ని మాజీ ఈవో తీసుకెళ్లినట్లు ఈ కేసులో ఆరోపణలు వచ్చాయి. శబరిమల మాజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బీ మురారి బాబును కూడా ఈ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మాజీ ఈవో కుమార్‌ను జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర చను న్నారు.



## మెగా ఫ్యామిలీ సమక్షంలో అట్టహాసంగా అల్లు శిరీష్ - నయనిక నిశ్చితార్థం

టాలీవుడ్ యంగ్ హీరో అల్లు శిరీష్ ఓ ఇంటివాడిగా మారేందుకు తొలి అడుగు వేశారు. ఆయన నిశ్చితార్థం శుక్రవారం, అక్టోబర్ 31న హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో ఉన్న నివాసంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు, సినీ ప్రముఖులు హాజరయ్యారు. తుపాను మొంథా కారణంగా ఏర్పాట్లలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, చివరికి అన్ని ఏర్పాట్లు విజయవంతంగా పూర్తయ్యాయి. శిరీష్ తన నిశ్చితార్థ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, "నా జీవితానికి ప్రేమ అయిన నయనికతో నా నిశ్చితార్థం జరిగింది" అని కామెంట్ పెట్టారు. ఫొటోలలో వధూవరులు ఇద్దరూ అద్భుతంగా కనిపించారు. అల్లు శిరీష్ వైట్ ట్రెడిషనల్ దుస్తుల్లో, నయనిక రెడ్డి రెడ్ కలర్ శారీలో మెరిసిపోయారు. ఇద్దరూ రింగులు మార్చుకుంటున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్‌కి చెందిన నయనిక రెడ్డి బిజినెస్ ఫ్యామిలీకి చెందిన అమ్మాయి. చాలా కాలంగా శిరీష్‌తో పరిచయం ఉండి, ఆ స్నేహం ప్రేమగా మారిందని సమాచారం. త్వరలోనే వీరి వివాహం జరగనున్నట్టు తెలుస్తోంది. అల్లు కుటుంబంతో పాటు, మెగాస్టార్ చిరంజీవి, సురేఖ, రాంచరణ్ — ఉపాసన, నాగబాబు — పద్మజ, పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా, వరుణ్ తేజ్ — లావణ్య త్రిపాఠి, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ లు హాజరై శిరీష్ దంపతులకు ఆశీస్సులు అందించారు.

## నిజామాబాద్‌లో గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మిట్టాపూర్ వద్ద గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురయ్యారు. మహిళను హత్యచేసిన దుండగులు.. మృతదేహాన్ని బాసరకు వెళ్లే రోడ్డు పక్కన వివస్త్రగా పడేశారు. తల, ఎడమ చేతి వేళ్లు, కుడిచేయి మణికట్టు వరకు లేకుండా మృతదేహం ఉన్నది. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. మరో ప్రాంతంలో చంపి అక్కడ పడేశారని భావిస్తున్నారు. హత్యకు గురైన వయస్సు 30 నుంచి 40 ఏండ్ల మధ్య ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మెల్లగా ఓపెన్ అవుతున్న తమన్నా..

తమన్నా బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ తో చెట్టాపట్టాలేసుకుని తిరిగినా అంతా గుట్టుగా చేద్దామని చూసింది, కానీ మీడియా మాత్రం ఎట్టాగో పసిగట్టేసింది. తర్వాత ఇద్దరి మధ్యన విభేదాలతో తమన్నా -విజయ్ వర్మ కు బ్రేకప్ అయ్యింది. ఆతర్వాత కూడా తమన్నా చాలా సైలెంట్ గా తన పని తను చూసుకుంటుంది. విజయ్ వర్మ మరో హీరోయిన్ తో మూవ్ ఆన్ అయ్యాడు అనే ప్రచారం ఉంది. తాజాగా తమన్నా తన బ్రేకప్ పై ఇండైరెక్ట్ గా రియాక్ట్ అయ్యింది. తనకు అబద్దాలు చెప్పేవాళ్ళు అన్నా, పక్కనే ఉండి మోసం చేసే వాళ్ళు అయినా అస్సలు నచ్చదు అని.. నేను ఒక గొప్ప లైఫ్ పార్టనర్ గా మారడానికి ప్రయత్నిస్తున్నాను. ఆయనకు నేను లక్కీ అనిపించేలా, అతనికి నేను వరంగా ఉండాలని కోరుకుంటాను. నెను అలా ఉండడానికి ప్రయత్నిస్తున్నాను. నా బంధంలో నిజాయితి ఉండాలని కోరుకుంటున్నాను అంటూ తమన్నా చెప్పడం చూసి ఆమె విజయ వర్మ బంధంలో ఇబ్బంది పడింది, అందుకే తమన్నా, విజయ్ వర్మతో విడిపోయింది అంటూ నెటిజెన్లు మాట్లాడుకుంటున్నారు.






## కరూర్ తొక్కిసలాట ఘటనపై స్పందించిన అజిత్.. పరిశ్రమకి చెడ్డపేరు తీసుకురావొద్దు

తమిళనాడులోని కరూర్‌లో దళపతి విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా తీవ్ర ఆవేదన కలిగించింది. ఈ ఘటనలో 41 మంది మృతి చెందగా, 60 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన విజయ్ బాధిత కుటుంబాలను స్వయంగా కలుసుకోవాలని నిర్ణయించారు.సెప్టెంబర్ 27న జరిగిన కరూర్ ర్యాలీలో ఊహించిన దానికంటే ఎక్కువ మంది తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు విజయ్ రూ. 20 లక్షల చొప్పన, గాయపడిన వారికి రూ. 2 లక్షల చొప్పన ఆర్థిక సాయం ప్రకటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ సమావేశం ద్వారా విజయ్ బాధిత కుటుంబాలకు తన మానసిక మద్దతు, సానుభూతి వ్యక్తం చేయాలని భావిస్తున్నారు. అయితే ఈ ఘటనపై ఇప్పటికీ విమర్శల వర్షం కొనసాగుతూనే ఉంది. తాజాగా ఈ ఘటనపై అజిత్ స్పందిస్తూ ఆసక్తికర కామెంట్స్ చేశారు.ఈ ఘటనకి విజయ్‌తో పాటు ప్రతి ఒక్కరు బాధ్యులేనని అజిత్ స్పష్టం చేశారు. మీడియాతో పాటు ఫ్యాన్స్, ఇతర వర్గాలు కూడా ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన అన్నారు. కరూర్ లాంటి రాజకీయ కార్యకలాపాలని పూర్తిగా నివారించాలంటూ అజిత్ పేర్కొన్నారు. ఒక వ్యక్తి వలన ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని నేను అనడం లేదు. కాని ఆ రోజు జరిగిన ఘటన తమిళనాట అన్నింటిని మార్చేసింది.



## అన్నదాతకు ఇదేమి కష్టం.. సోయా టోకెన్ల కోసం అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో రైతులు

నిర్మల్ జిల్లా కుభీర్‌లో సోయా టోకెన్ల కోసం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్యూలైన్‌లో చెప్పులు పెట్టి తమ వంతు కోసం వేచిచూస్తున్నారు. కుభీర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో (PACS) సోయా టోకెన్లు ఇస్తున్నారని తెలుసుకున్న రైతులు.. అర్ధరాత్రి నుంచి చెప్పలను క్యూ లైన్‌లో పెట్టి బారులు తీరారు. సోయా పంట చేతికి వచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ సోయా కొనుగోలు కేంద్రాలను ఇప్పటికీ తెరలేదు. దీంతో సుమారు 30 శాతం రైతులు సోయాలను దళారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం సోయా కొనుగోళ్లను చేపడుతుందని, రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ 15 రోజులుగా విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. దీంతో మండల రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో శుక్రవారం రాత్రి పీఏసీఎస్ అధికారికంగా సోయ కొనుగోలుకు సంబంధించి టోకెన్లను జారీ చేస్తామని ప్రకటించింది.

## బీజేపీ ఎంపీ రవి కిషన్‌కు చంపేస్తామంటూ బెదిరింపులు..

### "నేను భయపడను, ధర్మ మార్గంలో నిలుస్తాను"

బీజేపీ ఎంపీ, ప్రముఖ సినీ నటుడు రవి కిషన్ శుక్లాకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ ద్వారా బెదిరింపు కాల్స్ వచ్చాయి. బీహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన చేసిన ప్రసంగాలపై ఆగ్రహంతో ఒక వ్యక్తి ఈ బెదిరింపులు చేసినట్లు సమాచారం. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. రవి కిషన్ వ్యక్తిగత కార్యదర్శి శివమ్ ద్వివేది గోరఖ్‌పూర్‌లోని రామ్‌ఘర్ తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సెక్షన్ 302 (హత్య), 351(3), 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, నిందితుడు రవి కిషన్‌పై మాత్రమే కాకుండా ఆయన కుటుంబసభ్యులపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. అలాగే మత విశ్వాసాలపై అభ్యంతరకర పదాలు ఉపయోగించాడు. ఈ ఘటనపై రవి కిషన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నా తల్లిని ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడారు. శ్రీరాముడి గురించి కూడా అవమానకర పదాలు వాడారు. ఇది నా వ్యక్తిగత గౌరవంపైనే కాదు, మన ధర్మం, భారతీయ సంస్కృతిపై దాడి. కానీ నేను భయపడను. జాతీయవాదం, ధర్మ మార్గంలో నిలబడతాను," అని రవి కిషన్ ట్వీట్ చేశారు.